ప్రతిభ గ్రూప్స్ ప్రత్యేకం

**వందేమాతరం, హోంరూల్ ఉద్యమాలు అతివాదుల నాయకత్వంలో జరిగాయి. 1919 లో భారతదేశ జాతీయోద్యమంలో చోటుచేసుకున్న కొన్ని పరిణామాలు గాంధీ యుగానికి నాంది పలికాయి. మాంటేగ్ - చెమ్స్‌ఫర్డ్ సంస్కరణలను 1919 లో ప్రవేశపెట్టారు. రౌలట్ చట్టాన్ని 1919 ఏప్రిల్ 6 న చేశారు. 1919 ఏప్రిల్ 13 న జలియన్ వాలాబాగ్ దురంతం జరిగింది. ఇదే కాలంలో ముస్లింలు ఖిలాఫత్ ఉద్యమాన్ని ప్రారంభించారు.**

# 'రామదండు' దళాన్ని ఏర్పాటు చేసింది..?

## స్వాతంత్రోద్యమం

- ★ తిలక్ మరణానంతరం (1920 లో) గాంధీజీ కాంగ్రెస్‌కు నాయకుడయ్యాడు. గాంధీజీ నాయకత్వంలో సహాయ నిరాకరణ ఉద్యమం (1920-22), ఉప్పు సత్యాగ్రహం (1930-34) క్విట్ ఇండియా (1942) ఉద్యమాలు జరిగాయి.
- ★ ఆంధ్రదేశంలో ఈ ఉద్యమాలు పెద్ద ఎత్తున జరిగాయి. గాంధీ తొలిసారిగా 1919 లో రౌలట్ సత్యాగ్రహంలో భాగంగా సికింద్రాబాద్, విజయవాడల్లో ప్రసంగించారు. విజయవాడ రాజా రామమోహన్ రాయ్ గ్రంథాలయంలో జరిగిన గాంధీ ప్రసంగాన్ని అయ్యదేవర కాళేశ్వర రావు తెలుగులోకి అనువదించారు. మద్రాసులో జరిగిన గాంధీ సభకు టంగుటూరి ప్రకాశం పంతులు అధ్యక్షత వహించారు.

### సహాయ నిరాకరణ ఉద్యమం (1920-22)

- ★ 1920 సెప్టెంబరులో కలకత్తాలో జరిగిన ప్రత్యేక కాంగ్రెస్ సమావేశంలో సహాయ నిరాకరణ ఉద్యమ తీర్మానాన్ని ప్రవేశపెట్టారు. కానీ, కొండా వెంకటప్పయ్య ఈ తీర్మానాన్ని వ్యతిరేకించారు.
- ★ 1920 నాగ్‌పుర్ కాంగ్రెస్ సమావేశంలో ఉద్యమ తీర్మానం ఆమోదం పొందింది. గాంధీజీ కాంగ్రెస్ నాయకుడిగా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.
- ★ గాంధీజీ 1921 మార్చి 31, ఏప్రిల్ 1, 2 తేదీల్లో జరిగిన విజయవాడ కాంగ్రెస్ సమావేశాలకు హాజరయ్యారు. ఏలూరు, మచిలీపట్నం, చీరాల, నెల్లూరుల్లో పర్యటించారు.
- ★ 1921 అక్టోబరులో గాంధీజీ మళ్లీ ఆంధ్రాలో పర్యటించి, కర్నూలు, కడప, తిరుపతి, తాడిపత్రిల్లో ప్రసంగించారు.
- ★ విజయవాడ కాంగ్రెస్ సమావేశంలోనే కృష్ణాజిల్లా భట్లపెనుమర్రు గ్రామానికి చెందిన పింగళి వెంకయ్య, వీరంకి వెంకటశాస్త్రి సాయంతో త్రివర్ణ జాతీయ పతాకాన్ని రూపొందించాడు. గాంధీ ఆ జెండాలో కాషాయ రంగును, చరఖాను చేర్చారు.
- ★ విజయవాడ కాంగ్రెస్ సమావేశానికి తెలంగాణ నుంచి పరిశీలకుడిగా మాడపాటి హనుమంతరావు వచ్చారు.
- ★ తిలక్ స్వరాజ్య నిధికి యామినీ పూర్ణ తిలకం అనే ఆవిడ తన యావదాస్తిని, మాగంటి అన్నపూర్ణాదేవి తన నగలను నిలువు దోపిడీ ఇచ్చారు.
- ★ కూచిపూడి నృత్యకారుడైన అయ్యప్ప భాగవతార్ సహాయ నిరాకరణ ఉద్యమాన్ని ప్రచారం చేశాడు.
- ★ ఈ ఉద్యమ కాలంలోనే ఉన్నవ దంపతులు గుంటూరులో శారదా నికేతన్‌ను స్థాపించారు.
- ★ మాడభాషి నరసింహాచారి 'అసహాయోద్యమ విజయం', చెరుకువాడ నరసింహం 'స్వరాజ్య దర్పణం', పీసుపాటి నరసింహ శాస్త్రి 'చీరాల-పేరాల వనవాసం' గంథాలను రచించారు.
- ★ గుంటూరులోని తిలక్ నాటక సమాజం వారికి దామరాజు పుండరీకాక్షుడు స్వరాజ్య సోపానం, పాంచాల పరాభవం, స్వరాజ్య రథం లాంటి నాటకాలను రచించాడు.
- ★ అయ్యదేవర కాళేశ్వరరావు శాసనమండలికి, కొండా వెంకటప్పయ్య శాసనసభకు రాజీనామాలు చేశారు. గులాం మొహియుద్దీన్ తన మెజిస్ట్రేట్ పదవికి రాజీనామా చేశారు. వి. రామదాసు పంతులు మద్రాసు



విశ్వవిద్యాలయం సిండికేట్ పదవికి రాజీనామా చేశారు.

- ★ టంగుటూరి ప్రకాశం పంతులు, ఉన్నవ లక్ష్మీ నారాయణ, పోలిశెట్టి హనుమంతయ్య గుప్త, గొల్లపూడి సీతారామశాస్త్రి, శిష్టా పురుషోత్తమ్ లాంటివారు తమ న్యాయవాద వృత్తిని వదులుకున్నారు.
- ★ కొడాలి సుబ్బారావు, కల్లూరి సుబ్బారావు లాంటి 47 మంది ఉపాధ్యాయులు తమ ఉద్యోగాలను వదులుకున్నారు.
- ★ గరిమెళ్ల సత్యనారాయణ 'మాకొద్దీ తెల్లదొరతనం' లాంటి గీతాలను రాశారు.
- ★ కల్లు మానండోయ్ బాబు కళ్లు తెరవండోయ్ అంటూ మద్యపాన వ్యతిరేక ఉద్యమం జరిగింది.

### చీరాల-పేరాల ఉద్యమం

- ★ ఈ ఉద్యమాన్ని ఆంధ్రరత్న దుగ్గిరాల గోపాలకృష్ణయ్య నడిపించారు. చీరాల, పేరాల, వీర రాఘవపేట, జాంద్రపేట గ్రామాలను ఆంగ్రప్రభుత్వం మున్సిపాలిటీగా ప్రకటించడంతో ఈ ఉద్యమం మొదలైంది.
- ★ 1921 ఫిబ్రవరిలో నాటి మద్రాసు ముఖ్యమంత్రి, పురపాలక శాఖా మంత్రి అయిన రాజా రామరాయణింగార్ చీరాలను సందర్శించారు. గాంధీజీ 1921 ఏప్రిల్ 6 న చీరాలను సందర్శించి, శాంతియుత పన్నుల నిరాకరణ ఉద్యమాన్ని చేయమని సలహా ఇచ్చారు.
- ★ ఏప్రిల్ 25 న గ్రామాలను ఖాళీచేసి, రామ్‌నగర్ అనే ఆవాసాన్ని ఏర్పాటు చేసుకున్నారు. రామదండు అనే వాలంటీర్ దళాన్ని ఏర్పాటు చేశారు.
- ★ 'హిమాచల్ నుంచి కన్యాకుమారి వరకు ఈ ఉద్యమం ప్రజల హృదయాలను ఆశ్చర్యపూరితం చేసింది' అని కొండా వెంకటప్పయ్య పేర్కొన్నారు.

### పల్నాడు పుల్లరి సత్యాగ్రహం (1921 సెప్టెంబరు 23)

- ★ అటవీ ఉత్పత్తుల వినియోగంపై ఆంగ్లేయులు పుల్లరి పన్ను విధించారు. గుంటూరు జిల్లా పల్నాడు తాలూకాలోని మాచర్ల, వెల్దుర్తి, రెంటచింతల ప్రాంత ప్రజలు ఇబ్బందులు పడ్డారు. 12 అణాల పన్నును 3 అణాలకు తగ్గించమని కోరారు.
- ★ మించాలపాడుకు చెందిన కన్నెగంటి హనుమంతు ఈ ఉద్యమాన్ని చేయడంతో ఆంగ్ల ప్రభుత్వం 1921 సెప్టెంబరు 23 న హనుమంతును మించాలపాడు వద్ద కాల్చి చంపారు.

### పెదనందిపాడు పన్నుల నిరాకరణ ఉద్యమం

- ★ ఆంధ్రా శివాజీగా పేరొందిన పర్వతనేని వీరయ్య చౌదరి నాయకత్వంలో ఈ ఉద్యమం జరిగింది. వీరయ్య చౌదరి శాంతిసేన అనే వాలంటీర్ దళాన్ని ఏర్పాటు చేశాడు. అప్పటి గ్రామ ఉద్యోగుల సంఘం నాయకుడైన మాచిరాజు సత్యనారాయణ రాజు కూడా ఉద్యమంలో పాల్గొన్నాడు.
- ★ ఉద్యమాన్ని అణచివేయడానికి రూథర్‌ఫర్డ్‌ను ప్రత్యేక కమిషనర్‌గా ప్రభుత్వం నియమించింది. కానీ ఉద్యమం ఆగలేదు. ఇంగ్లండ్ పార్లమెంటులో కూడా ఈ ఉద్యమం చర్చకు వచ్చింది. నాటి మద్రాసు గవర్నర్ వెల్లింగ్‌టన్ 'ఆంగ్ల సామ్రాజ్య పునాదులనే కదిలించిన ఉద్యమం'గా పెదనందిపాడు ఉద్యమాన్ని అభివర్ణించాడు.
- ★ చివరకు ప్రభుత్వం రాజీ మార్గం కోసం రెవెన్యూ సంఘ సభ్యుడైన హేరిస్‌ను పంపింది. ఈ ఉద్యమాన్ని నిలిపివేయాల్సిందిగా గాంధీజీ కూడా కొండా వెంకటప్పయ్యకు లేఖ రాశారు. దీంతో ఉద్యమాన్ని నిలిపివేశారు.



రచయిత
- బి. నాగరాజు
విషయ నిపుణులు

- ★ 1922 ఫిబ్రవరి 5న చౌరీ-చౌరా సంఘటనతో గాంధీజీ సహాయ నిరాకరణ ఉద్యమాన్ని కూడా నిలిపివేయడంతో ఆంధ్రాలో ఈ ఉద్యమం ఆగిపోయింది.

### రంపా విప్లవం (అల్లూరి సీతారామరాజు)

- ★ 1922-24 మధ్య అల్లూరి సీతారామరాజు రంపా విప్లవాన్ని నిర్వహించాడు.
- ★ 1897 జులై 4 న అల్లూరి విశాఖ జిల్లాలోని పాండ్రంకి గ్రామంలో మాతామహుల ఇంట జన్మించాడు. అతని స్వస్థలం పశ్చిమ గోదావరి జిల్లాలోని మోగల్లు.
- ★ చింతపల్లి తహశీల్దార్ బాస్టియన్, కాంట్రాక్టర్ సంతానం పిళ్ళైల దౌర్జన్యాలకు వ్యతిరేకంగా సీతారామరాజు సాయుధ పోరాటాన్ని ప్రారంభించాడు.
- ★ రామరాజు తాండవ నదీతీరంలో నీలకంఠేశ్వరస్వామి ఆలయ ప్రాంగణంలో 'శ్రీరామ విజయనగరం' అనే ఆశ్రమాన్ని ఏర్పాటు చేసుకున్నాడు.
- ★ భట్టిపానుకుల గ్రామానికి చెందిన గాం మల్లుదొర, గాంగంటం దొరలతోపాటు ఎండుపడాల్, వీరయ్యదొర, అగ్గిరాజు లాంటి అనుచరులతో రంపా విప్లవాన్ని నడిపాడు.
- ★ అగ్గిరాజు అసలు పేరు పేరిచర్ల సూర్య నారాయణ రాజు.
- ★ 1922 ఆగస్టు 22న చింతపల్లి పోలీస్ స్టేషన్‌పై తొలి దాడి జరిపిన రామరాజు 1923 ఏప్రిల్ 18న అన్నవరం పోలీస్ స్టేషన్‌పై చివరి దాడి జరిపాడు.
- ★ రామరాజును అణచడానికి ఆంగ్ల ప్రభుత్వం బళ్ళారి, మలబారు పోలీస్ దళాలను, అస్సాం రైఫిల్స్ దళాలను పంపించింది.
- ★ బళ్ళారి పోలీసు దళానికి చెందిన స్కాట్ కోవార్డ్, హేటర్‌లను వంజేరిఘాట్, దామనపల్లి, గోకిరి మెట్ర ప్రాంతాల్లో ఎదిరించి వారిని చంపివేశారు.
- ★ తురుమామిడి, లక్కవరపుకోట, అడ్డతీగల, రంప చోడవరం ప్రాంతాల్లో రామరాజు దళం దాడులు జరిపింది.
- ★ సీతారామరాజుకు స్వాగతం పలికినందుకు అన్నవరం, శంఖవరం గ్రామాలపై ప్రభుత్వం రూ. నాలుగు వేల జరిమానా విధించింది.
- ★ మల్లుదొరను కీరన్స్ అనే అధికారి చంపాడు.
- ★ 1924 జనవరిలో రూథర్‌ఫర్డ్ నాయకత్వంలో అస్సాం రైఫిల్స్ దళం వచ్చింది.
- ★ 1924 మే 6 న పాడేరు నదీతీరంలో సీతారామరాజును జమేదార్ కంచుమీనన్ బంధించాడు. 7 న మేజర్ గుడాల్ సీతారామరాజును కాల్చి చంపాడు.
- ★ సీతారామరాజు సమాధి కృష్ణదేవి పేట (K.D.పేట)లో ఉంది.
- ★ గాంధీజీ యంగ్ ఇండియా పత్రికలో సీతారామరాజు గురించి.. 'నేను సాయుధ విప్లవాన్ని ఆమోదించలేను. కానీ ధైర్యవంతుడు, త్యాగపురుషుడు అయిన ఈ యువకుడికి జోహార్లు అర్పించకుండా ఉండలేను' అని రాశాడు.

## స్వరాజ్యపార్టీ స్థాపన



- ★ గాంధీజీ నిర్బంధంతో 1922 డిసెంబరులో జరిగిన కాంగ్రెస్ సమావేశంలో రెండు వర్గాలు బయలుదేరాయి.
- ★ 1922 గయ కాంగ్రెస్ సమావేశానికి అధ్యక్షుడు చిత్తరంజన్‌దాసు. గాంధీ అనుచరులైన రాజేంద్ర ప్రసాద్, సర్దార్ వల్లభాయ్ పటేల్ లాంటివారు మార్పుకు వ్యతిరేక వర్గంగా రూపొందగా, C.R.దాస్, మోతీలాల్ నెహ్రూ లాంటివారు మార్పుకు అనుకూల వర్గంగా రూపొంది, 1923 లో స్వరాజ్యపార్టీని స్థాపించారు.
- ★ ఆంధ్రాలో స్వరాజ్యపార్టీ శాఖకు వి.వి. రామదాసు అధ్యక్షుడిగా, ఉన్నవ లక్ష్మీ నారాయణ కార్యదర్శిగా నియమితులయ్యారు.
- ★ చిత్తరంజన్‌దాస్ ఆంధ్రాలో పర్యటించి, ఎన్నికల ప్రచారం చేశారు.
- ★ 1924 గంజాం జిల్లా సభలో బులుసు సాంబమూర్తి, డాక్టర్ సుబ్రహ్మణ్యం స్వరాజ్య తీర్మానాన్ని ప్రవేశపెట్టారు.
- ★ 1926 ఎన్నికల్లో టంగుటూరి ప్రకాశం నాయకత్వంలో కాంగ్రెస్ విజయం సాధించినప్పటికీ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయలేదు. దీంతో జస్టిస్ పార్టీ డా॥ సుబ్బరాయన్ ముఖ్యమంత్రిగా స్వతంత్ర ప్రభుత్వాన్ని ఏర్పాటు చేశారు.

### సైమన్ కమిషన్

- ★ ఆంగ్ల ప్రభుత్వం 1927 లో సైమన్ కమిషన్‌ను నియమించింది.
- ★ మాంటేగ్-చెమ్స్‌ఫర్డ్ సంస్కరణల్లోని లోపాలను అధ్యయనం చేయడం, భారతీయ సమస్యలను తెలుసుకోవడమనే లక్ష్యాలతో ఏర్పడిన ఈ కమిషన్‌లో భారతీయులకు స్థానం కల్పించకపోవడంతో దీనికి వ్యతిరేకంగా సైమన్ కమిషన్ వ్యతిరేక ఉద్యమం జరిగింది.
- ★ 1928 ఫిబ్రవరి 3 న సైమన్ కమిషన్ బొంబాయిలో దిగిన రోజున మద్రాసులో కాశీనాథుని నాగేశ్వరరావు పంతులు అధ్యక్షతన నిరసన సభ జరిగింది.
- ★ 1928 ఫిబ్రవరి 26 న మద్రాసులో సైమన్ కమిషన్ వ్యతిరేక ఉద్యమం టంగుటూరి ప్రకాశం పంతులు అధ్యక్షతన జరిగింది.
- ★ పోలీసు కాల్పుల్లో పార్థసారధి అనే వ్యక్తి మరణించాడు. అతడిని తీసుకురావడానికి వెళుతున్న ఉద్యమకారులపై పోలీసులు తుపాకులు ఎక్కుపెట్టారు. టంగుటూరి తుపాకులకు తన గుండెను ఎదురొడ్డినందుకు ఆయన్ని 'ఆంధ్రకేసరి' అని ప్రజలు నినదించారు.
- ★ సైమన్ కమిషన్ విజయవాడ రైల్వేస్టేషన్‌లో దిగినప్పుడు నాటి విజయవాడ మున్సిపల్ చైర్మన్ అయ్యదేవర కాళేశ్వరరావు సైమన్ గోబ్యాక్ అనే నినాదం ఉన్న చీటీని పంపాడు.
- ★ సైమన్ కమిషన్ బహిష్కరణ ఉద్యమాన్ని నిర్వహించిన బులుసు సాంబమూర్తిని ఆంగ్ల ప్రభుత్వం నిర్బంధించింది.

**ప్రతిభ పేజీలపై మీ అభిప్రాయాలు, సూచనలు పంపాల్సిన ఈమెయిల్ ఐడీ**
pratibhadesk@eenadu.net